www.prajasakti.com
ప్రజాశక్తి
గురువారం 18 జనవరి 2024
5
అన్నమయ్య

షాదీఖానాను వినియోగంలోకి తీసుకొస్తాం :'గడికోట'

ప్రజాశక్తి-రాయచోటి టౌన్

పట్టణంలోని షాదీఖానాకు మరమ్మతులు చేపట్టి త్వరలో వినియోగంలోకి తీసుకువస్తామని ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి పేర్కొనారు. బుధవారం పట్టణంలోని ఫైర్ స్టేషన్ సమీపంలోని షాదీ ఖానాను మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ బాషా, మున్సిపల్ ఇంజినీరింగ్, ఆర్‌అండ్‌బి అధికారులతో కలిసి పరిశీలించారు. షాదీఖానాలోని గోడలు, కిటికీలు, స్లాబ్, మరుగుదొడ్లను పరిశీలించారు. మున్సిపల్ కమిషనర్ గంగాప్రసాద్, ఆర్‌అండ్‌బి డిఇ వెంకట సుబ్బయ్య, మున్సిపల్ డిఇ సుధాకర్‌నాయక్, ఎఇ కృష్ణారెడ్డి, ఆర్‌అండ్‌బి ఎఇ గిరీశ్వరరావులతో చర్చించి మరమ్మతులుకు త్వరితగతిన ఎస్టిమేషన్లను తయారు చేయాలని సూచించారు. పేదలు, దిగువ, మధ్య తరగతి ప్రజల సౌకర్యార్థంగా షాదీఖానాను అభివృద్ధి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ఫయాజర్ రెహమాన్, మైనార్టీ జిల్లా అధ్యక్షుడు బేపారి మహమ్మద్ ఖాన్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తబ్రేజ్‌ఖాన్, కొలిమి చాన్‌బాషా, సుగవాసి ఈశ్వర్ ప్రసాద్, సుగవాసి శ్యామ్, జానం రవీంద్ర యాదవ్ పాల్గొన్నారు.

నిర్బంధాలతో సమ్మెను ఆపలేరు

- కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలు
- 37వ రోజూ కొనసాగిన అంగన్వాడీల సమ్మె
- పార్టీలు, ప్రజల నుంచి పెరుగుతున్న మద్దతు

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి

నిరంకుశ నిర్బంధాలతో సమ్మెను ప్రభుత్వం ఆపలేదని సిఐటియు జిల్లా ట్రెజరర్ హరీశర్మ పేర్కొన్నారు. లక్కిరెడ్డిపల్లి మహిళా శిశు సంక్షేమ ప్రాజెక్టు కార్యాలయం వద్ద అంగన్వాడీలు చేపట్టిన 37వ రోజుకు సమ్మె చేరుకుంది. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాసులుతో కలిసి ఆయన మాట్లాడుతూ ఐక్యంగా సిఐటియు, ఎఐటియుసి, ఐఎఫ్‌టియు ఆధ్వర్యంలో నిరవధిక నిరాహార దీక్షలు మొదలుపెట్టాయన్నారు. ప్రభుత్వం పైన తీవ్రమైన ఒత్తిడి పెరుగుతుందని అంగన్వాడీలు తప్పక విజయం సాధిస్తారని మనోస్థైర్యం కోల్పోకుండా ఉద్యమాన్ని మరింత ఉధృతంగా సమర్థవంతంగా ముందుకు తీసుకెళ్లాలని పేర్కొన్నారు. సమ్మె ప్రారంభం నుండి ప్రభుత్వం పైన నాలుగు విజయాలు సాధించామని చెప్పారు. సమ్మె నోటీసు ఇచ్చిన రోజు నుండి ప్రభుత్వం అంగన్వాడీలపై అస్మా ప్రయోగిస్తామని, ఉద్యోగులు తొలగిస్తామని జిల్లా కలెక్టర్లతో నోటీసులు ఇచ్చి వైఫల్యం చెందిందని తెలిపారు. సచివాలయ సిబ్బంది, మహిళా పోలీసులు, తహశీల్దారు అంగన్వాడీ సెంటర్ తాళాలు పగలగొట్టి పని చేయిస్తామని చెప్పి వారు సాధించింది ఏమీలేదని పేర్కొన్నారు.

లక్కిరెడ్డిపల్లె : మాట్లాడుతున్న శ్రీనివాసులు

రైల్వేకోడూరు : నిరసన తెలుపుతున్న అంగన్వాడీలు

సెంటర్లలో ఉయ్యాలలూగుతూ సెల్ ఫోన్లో వీడియోలు చూస్తూ వారు చేసింది ఏమీ లేదు కాలయాపన చేశారన్నారు. గుడ్డి ప్రభుత్వానికి కుంటి ప్రభుత్వానికి చెవిటి ప్రభుత్వానికి అంగన్వాడీల సమస్యలు పట్టడం లేదని తెలిపారు. దళితులు, బీసీలు, మైనార్టీలు నా బంధువులు నా అక్క చెల్లెమ్మలు అని చెప్పే ముఖ్యమంత్రి సంక్రాంతి పండగ రోజు సెట్టింగ్‌కు రూ.కోట్లు ఖర్చు పెట్టారన్నారు. సామాన్యుల సమస్యలు ఆయన కట్టడం లేదని తెలిపారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్ అధ్యక్షులు సుకుమారి, కార్యదర్శి ఓబులమ్మ సెక్టార్ లీడర్లు రామాపురం, లక్కిరెడ్డిపల్లి, గాలివీడు మండలాల అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. **రైల్వేకోడూరు :** అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో చేపట్టిన నిరవధిక సమ్మెలో భాగంగా బుధవారం 37వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా అంగన్వాడీలు ర్యాలీ నిర్వహించి ఐసిడిఎస్ కార్యాలయం సమీపంలో నిరాహార దీక్షలు చేపట్టారు కార్యక్రమంలో అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్ యూనియన్, సిఐటియు అనుబంధం, సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్ చంద్రశేఖర్, జిల్లా అధ్యక్షులు శ్రీలక్ష్మీ, ప్రాజెక్టు, గౌరవ అధ్యక్షులు, వనజ కుమారి, అధ్యక్షులు, శ్రీరమాదేవి, వర్కింగ్ ప్రెసిడెంట్, రాధా కుమారి, మండల కార్యదర్శి జి.పద్మావతి, వెన్నెల, దుర్గ, శిరీష, లీలావతి, జయకుమారి, సుజాత, మునీంద్ర, ఈశ్వరమ్మ, కుమారి, నాగరాణి, వాణి, స్వర్ణలత, గీత, సురేఖ, కళ, రెడ్డమ్మ, రోజా, చెంచులక్ష్మి, బేబీ, సునీత, ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు జాన్ ప్రసాద్,ఏఐటీయూసీ నాయకులు సరోజ నిర్మల నాగమణి, అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

అర్హులందరికీ భూ పంపిణీ : గిరీష

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ గిరీష

ప్రజాశక్తి-రాయచోటి

అసైన్మెంట్ కమిటీ ద్వారా అర్హులందరికీ భూ పంపిణీ చేయడం జరుగుతుందని కలెక్టర్ గిరీష పేర్కొన్నారు. బుధవారం జిల్లా ఇన్‌ఛార్జి కాకాని గోవర్ధన్‌రెడ్డి, తమ క్యాంపు కార్యాలయం నుంచి విసి ద్వారా అర్హులైన పేదలకు రెండవ విడత భూ పంపిణీ చేసేందుకు అసైన్మెంట్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టరేట్లోని మినీ విసి హాల్ నుంచి కలెక్టర్ గిరీష్, ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి, శాసనమండలి డిప్యూటీ చైర్మన్ జకియా ఖానం, జెసి ఫర్మాన్ అహ్మద్ ఖాన్, రాయచోటి, రాజంపేట, రంగస్వామి రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో భూమి లేని నిరుపేదలకు అసైన్మెంట్ కమిటీ ద్వారా భూ పంపిణీ చేస్తామన్నారు. జెడ్‌హెచ్‌డిసి భూములకు సంబంధించి నందలూరు మండలంలో 48 మందికి 67.51 ఎకరాలు, ఓబులవారిపల్లె మండలంలో 76 మందికి 115.61 ఎకరాలు, రైల్వేకోడూరు మండలంలో 41 మందికి 41.00 ఎకరాలు, చిట్వేల్ మండలంలో 140 మందికి 337.28 ఎకరాలు, సంబేపల్లి మండలంలో 212 మందికి 217.74 ఎకరాలు, ఓబులవారిపల్లి మండలంలో 159 మందికి 235.83 ఎకరాలు, మొత్తం 674 మందికి 1014.97 ఎకరాలు డీకేటి పట్టాలు పంపిణీ చేసేందుకు ఆమోదం తెలపడం జరిగిందన్నారు. అదేవిధంగా అసైన్మెంట్ భూములు రెండవ విడతలో భూమిలేని పేదలకు రాయచోటి నియోజకవర్గంలోని చిన్నమండెం మండలంలో 255 మందికి 316.52 ఎకరాలు, గాలివీడు మండలంలో 559 మందికి 773.05 ఎకరాలు, లక్కిరెడ్డిపల్లి మండలంలో 264 మందికి 461.24 ఎకరాలు, రామాపురం మండలంలో 39 మందికి 64.91 ఎకరాలు, రాయచోటి మండలంలో 161 మందికి 236.76 ఎకరాలు, సంబేపల్లి మండలంలో 215 మందికి 268.78 ఎకరాలు, మొత్తం 1531 మందికి 2197.72 ఎకరాలు. రైల్వే కోడూరు నియోజకవర్గంలోని పెనగలూరు మండలంలో 100 మందికి 191.74 ఎకరాలు, చిట్వేల్ మండలంలో 109 మందికి 136.37 ఎకరాలు, పుల్లంపేట మండలంలో 23.38 ఎకరాలు, మొత్తం 211 మందికి 331.49 ఎకరాలు భూ పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. పీలేరు నియోజకవర్గంలోని కేవీ పల్లె మండలంలో 1 ఒకరికి 2.45 ఎకరాలు, మొత్తం 1743 మందికి 2531.66 ఎకరాల భూ పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో అర్హులైన పేదలందరికీ అసైన్మెంట్ కమిటీ ద్వారా భూ పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. పేదల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని పరంబోకు భూములు, వాగులు, వంకలు, కాకుండా, వ్యవసాయానికి యోగ్యవంతమైన భూములు పేదలకు పంపిణీ చేసేందుకు జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి ఆమోదం తెలిపారని పేర్కొన్నారు.

అప్రోచ్ రోడ్డును ప్రారంభిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే

అప్రోచ్ రోడ్డును ప్రారంభించిన కలెక్టర్, ఎమ్మెల్యే

ప్రజాశక్తి-రాయచోటి

పట్టణ సమీపంలోని నక్కవాండ్లపల్లెలో నూతనంగా నిర్మించిన వైఎస్ఆర్ క్రికెట్ స్టేడియం, దిగువ అబ్బవరంలో గల ఎంఐజి లేఅవుట్‌లకు అప్రోచ్ రోడ్లను ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి, కలెక్టర్ గిరీష కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లా కేంద్రమైన రాయచోటిలో నూతనంగా నిర్మించిన క్రికెట్ స్టేడియంకు ఎంతో అవసరమైన అప్రోచ్ రోడ్డును, దిగువ అబ్బవరంలో గల ఎంఐజి లేఅవుట్‌కు అవసరమైన అప్రోచ్ రోడ్డును త్వరగా పూర్తి చేసి ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. ఎంఐజి లేఔట్‌లో అవసరమైన మౌలిక సదుపాయాలు త్వరగా పూర్తి చేయాలని, ఇళ్లకు నిర్మించుకునే వారికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూసేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ రూ.119 లక్షలతో దాదాపు 750 మీటర్ల అప్రోచ్ రోడ్డు క్రికెట్ స్టేడియంను చేరుకోవడానికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. సాయి ఇంజినీరింగ్ కాలేజీ వెనుక వైపు నుంచి 2.9 కిలోమీటర్ల పొడవుతో రూ.970 లక్షలతో నిర్మించిన అప్రోచ్ రోడ్డు దిగువ అబ్బవరంలో గల ఎంఐజి లేఅవుట్‌ను చేరుకోవడానికి సులభతరం చేస్తుందని తెలిపారు. లేఅవుట్‌లో మౌలిక సదుపాయాలను త్వరగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ ఫయాజ్‌బాషా, మునిసిపల్ కమిషనర్ గంగా ప్రసాద్, కడప అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ వైస్ చైర్మన్ నందన్, ఆర్ అండ్‌బి అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

నేడు రక్తదాన శిబిరం

ప్రజాశక్తి-రాయచోటి

టిడిపి వ్యవస్థాపకులు ఎన్‌టి.రామారావు వర్ధంతి, తన పుట్టినరోజు సందర్భంగా గురువారం గాలివీడు రోడ్డులోని ప్రీతం రెసిడెన్సిలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు సుగువాసి ప్రసాద్‌బాబు పేర్కొన్నారు. ఎంతోమంది రక్త కొరతతో ఇబ్బందులు గురవుతున్నారని వారిని దృష్టిలో ఉంచుకొని రక్తదాన శిబిరం ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమానికి నియోజక వర్గంలోని టిడిపి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు,పెద్దఎత్తున హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

భూమిపూజ కార్యక్రమంలో అమర్నాథ్‌రెడ్డి

28 నుంచి జాతీయ బాలికల కబడ్డీ పోటీలు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

ఈనెల 28వ తేదీ నుంచి జరగబోవు జాతీయ స్థాయి అండర్-14 బాలికల కబడ్డీ పోటీలకు బుధవారం స్థానిక ఇన్ఫాంట్ జీసస్ హైస్కూల్‌లో జడ్‌పి చైర్మన్ ఆకేపాటి అమర్నాథ్‌రెడ్డి భూమిపూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆయనతో పాటు డివైఇఒ వరలక్ష్మి, ఆర్ఐపిఇ భానుమూర్తిరాజు, ఎస్‌జిఎఫ్ కార్యదర్శి వసంతకుమారి, ఎస్‌జిఎఫ్ కమిటీ సభ్యులు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, పీడీలు పాల్గొన్నారు.

ముడిమెల లక్ష్మీదేవి మృతి తీరని లోటు

ప్రజాశక్తి - కడప

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు ఎం.లక్ష్మి దేవి ఆకస్మిక మరణం సేవా రంగానికే తీరని లోటని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అనారోగ్యం కారణంగా గత కొన్ని రోజులుగా హైదరాబాద్‌లోని ఓ ప్రయివేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఎం.లక్ష్మీదేవి బుధవారం ఉదయం తుది శ్వాస విడిచారు. ఈ విషయం తెలుసుకున్న కేసలి అప్పారావు ఆమె మృతి పట్ల తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. జమ్మలమడుగుకు చెందిన ఎం.లక్ష్మీదేవి జమ్మలమడుగు బార్ అసోసియేషన్ సభ్యురాలిగా న్యాయవాద వృత్తిలో కొనసాగుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలిగా బాధ్యతలు స్వీకరించినప్పటి నుండి బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ కార్యక్రమాలలో ఎన్నోరకాలుగా సేవలు అందించారన్నారు. ఆమె మృతి జమ్మలమడుగు బార్ అసోసియేషన్ లోనే కాకుండా బాలల హక్కుల పరిరక్షణ కమీషన్‌కు వెలితిని నింపిందన్నారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని, ఆమె కుటుంబానికి ఆ భగవంతుడు మనోధైర్యాన్ని ప్రసాదించాలని చైర్మన్ కేసలి అప్పారావు కోరారు. సంతాపం వ్యక్తం చేసిన వారిలో రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు రాజేంద్ర ప్రసాద్, బత్తుల పద్మావతి, ఆదిలక్ష్మి, గోండు సీతారాం ఉన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో కనీస సౌకర్యాలు కల్పించాలి : కలెక్టర్

ప్రజాశక్తి-రాయచోటి

జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాలలో త్వరితగతిన కనీస సౌకర్యాలు కల్పించాలని కలెక్టర్ గిరీష సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి కలెక్టర్ గిరీష జిల్లాలోని పోలింగ్ కేంద్రాలలో కనీస సౌకర్యాలపై తహశీల్దార్‌లు, ఎంపిడిఒలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నమయ్య జిల్లాలో మొత్తం 1607 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని ఈ నెల 26వ తేదీ లోపల అన్ని పోలింగ్ కేంద్రాలలో కనీస సౌకర్యాలు కల్పించాలన్నారు. ముఖ్యంగా ర్యాంపులు, టాయిలెట్స్ తాగునీరు, నీటి వసతితో కూడిన మరుగుదొడ్లు, ఫర్నిచర్, విద్యుత్ సౌకర్యం, లైటింగ్ వంటి అన్ని వసతులు తప్పనిసరిగా ఉండాలన్నారు. 70 పోలింగ్ కేంద్రాలలో కరెంట్ సదుపాయం లేదని వెంటనే వీటికి కరెంట్ కనెక్షన్ ఇవ్వాలని ఎపిఎస్‌పిడిసిఎల్ అధికారులకు సూచించారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో తప్పకుండా 3 పిన్ సాకెట్ ఉండాలన్నారు. పోలింగ్ స్టేషన్‌కు స్లాబు, ఫ్లోరింగ్ తప్పకుండా ఉండాలని పోలింగ్ కేంద్రాలకు పోలింగ్ కేంద్రం నెంబర్లు పెయింటింగ్ చేయించాలన్నారు. సెక్టోరల్ అధికారులు పోలింగ్ కేంద్రాలలో కనీస సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి సారించి అన్ని వసతులు ఉండేటట్లు చూడాలన్నారు. బిఎల్‌ఒలు, తహశీల్దార్లు, ఇఆర్‌ఒలు, ఆయా అంశాల జిల్లా అధికారులు పోలింగ్ కేంద్రాలను తప్పనిసరిగా సందర్శించి కనీస వసతులు లేని స్కూల్స్, కాలేజీల వివరాలు సమర్పించాలని చెప్పారు. నియోజకవర్గాలలో ఇవిఎంల వినియోగంపై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు విస్తృతంగా చేపట్టాలన్నారు. ఎన్నికల నిర్వహణ సంబంధించి ప్రతి అంశాన్ని సంబంధిత అధికారులు సీరియస్‌గా తీసుకొని పనులు చేపట్టాలని ఇందులో నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎన్నికలకు సంబంధించి వివిధ అంశాలపై కలెక్టర్ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, రాయచోటి, మదనపల్లె, రాజంపేట ఆర్‌డిఒలు రంగస్వామి, మురళి, రామకృష్ణారెడ్డి, డిఇఒ పురుషోత్తం, తహశీల్దార్లు, సంబంధింత శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ గిరీష

రూ.13.8 కోట్లతో హైలెవెల్ బ్రిడ్జి నిర్మాణానికి భూమిపూజ

బ్రిడ్జి నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న నాగార్జునరెడ్డి, జడ్‌పి చైర్మన్, ఎమ్మెల్యే

ప్రజాశక్తి-వీరబల్లి

మండలంలోని గడికోట పంచాయతీలోని పెద్దూరు వద్ద మాండవ్య నదిపై రూ.13.8 కోట్లతో హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణానికి బుధవారం రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి చైర్మన్ మాజీ జస్టిస్ సివి నాగార్జునరెడ్డి, ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి, జిల్లా పరిషత్ చైర్మన్ ఆకేపాటి అమర్నాథరెడ్డి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాలుగా ప్రజలు నదిపై బ్రిడ్జి లేక వర్షాలు వస్తే చాలా ఇబ్బందులకు గురవుతూ ఉండేవారన్నారు. బ్రిడ్జి నిర్మాణంతో గడిగోట ప్రజల కల నెరవేరునట్లు అయింది. నాగార్జునరెడ్డి తన సొంత గ్రామం కావడంతో ఉన్నతస్థాయి అధికారులు, రాజకీయ నాయకులతో చర్చించి పట్టుదలతో ఈ హై లెవెల్ బ్రిడ్జిని తీసుకవచ్చారని అన్నారు. గతంలో ఉన్న ప్రభుత్వాలకు అనేకసార్లు వినతి పత్రాలు సమర్పించినా పట్టించుకున్న పాపాన పోలేదని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి బ్రిడ్జి నిర్మాణానికి ఆమోదం తెలపడం హర్షణీయమన్నారు. బ్రిడ్జి మంజూరుకు ప్రయత్నించిన స్థానిక నాయకులకు ముఖ్యమంత్రికి గ్రామ ప్రజలు అభినందనలు తెలిపారు. ఎన్నో ఏళ్ల కల నేటితో మాకు నెరవేరిందని ఆనందాన్ని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి విజయభాస్కర్ రెడ్డి, ఎంపిపి గాలివీటి రాజేంద్రనాథ్‌రెడ్డి, గాలివీటి వీరనాగిరెడ్డి, రాజంపేట నియోజకవర్గపు వైసిపి నాయకులు గాలివీటి మదన్‌రెడ్డి, జడ్‌పిటిసి శివరాంగౌడ్, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, మండలం లోని వైసిపి నాయకులు పాల్గొన్నారు.

రిటైర్డ్ ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

'సమాజ సేవకు పాటుపడాలి'

ప్రజాశక్తి-ఒంటిమిట్ట

పూర్వ విద్యార్థుల కలయిక ప్రశంసనీయమని, ఇలాంటి కార్యక్రమాలు స్నేహభావం, ఐకమత్యం పెంపొందిస్తుందని, ప్రయోజకులైన ప్రతి ఒక్కరూ సమాజ సేవకు పాటుపడాలని, మీతో పాటు విద్యనభ్యసించి అకాల మరణం చెందిన కుటుంబాలకు తోడుగా ఉండి భరోసా అందించాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1989-90 బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో బుధవారం ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. 34 ఏళ్ల తర్వాత కలిసిన నాటి విద్యార్థులు, నేటి మిత్రులు ఒకరినొకరు యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను నాటి విద్యార్థులు దుశ్శాలువతో ఘనంగా సన్మానించారు. ఈ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనానికి 1980-81 బ్యాచ్ పూర్వ విద్యార్థి డిఎస్‌పి లక్ష్మి నారాయణ, స్థానిక సిఐ పురుషోత్తమరాజు, ఉపాధ్యాయులు కుల్లాయిరెడ్డి, నాగామునిరెడ్డి, నారాయణరెడ్డి, వెంకటరెడ్డి, బాలమ్మ, రాజారెడ్డి, సీనియర్ అసిస్టెంట్ భారతి పాల్గొని విలువైన సందేశాన్ని అందించారు. హాజరైన వారికి నుతనోత్సాహం అందించేలా పాటలు, నృత్యాలను నిర్వాహకులు ఏర్పాటు చేసి ఆకట్టుకున్నారు. పాల్గొన్న వారికి మెమెంటోలు అందజేశారు. కార్యక్రమంలో గెట్ టుగెదర్ కోర్ కమిటీ సభ్యులు స్పెషల్ క్లాస్ ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్ ఎస్‌వి.రమణ, ఎపిఇఆర్‌సి ప్రాజెక్ట్ డైరెక్టర్ మోదుగుల లక్ష్మీనరసయ్య, ఎన్‌హెచ్ఎఐ 45 సివిల్ ఇంజినీర్ అరెం భాస్కర్ రెడ్డి, సీనియర్ పాత్రికేయులు ఎస్వీ రమణ, జైన్ డ్రిప్ ఇరిగేషన్ ఏజెన్సీ డీలర్ జ్యోతి సుబ్బారెడ్డి, పి.చెంగమ్మ, కె.వెంకట సుబ్బమ్మ, మామిడి బాబు కత్తిచంద్ర, 40 మంది క్లాస్ మేట్స్ పాల్గొన్నారు.

నేడు టిడిపిలోకి రూపానందరెడ్డి

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

చంద్రబాబుతో రూపానందరెడ్డి

వైసిపి సీనియర్ నాయకులు ముక్కా రూపనందరెడ్డి నేడు టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు సమక్షంలో లాంఛనంగా టిడిపి కండువా కప్పుకోబోతున్నారు. ఇప్పటికే రెండు మూడుసార్లు రూపానందరెడ్డి చంద్రబాబు నాయుడుతో భేటీ అయ్యారు. పార్టీలో తనకు సముచిత స్థానం కల్పిస్తానని హామీ ఇవ్వడంతో పార్టీలో చేరేందుకు ఈ నెల 18 తేదీన పార్టీ తీర్థం పుచ్చుకునేందుకు ముహూర్తం ఖరారు చేసుకున్నారు. ఇప్పటికే జిల్లా స్థాయి, నియోజకవర్గ స్థాయి టిడిపి ముఖ్య నేతలతో కలిసి మంతనాలు జరిపారు. వైసిపిలోని అసమ్మితి నేతలు రూపానందరెడ్డితో టచ్‌లో ఉన్నారు. మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్.రాజశేఖర్‌రెడ్డి కుటుంబానికి విధేయుడుగా ఉన్న రూపానందరెడ్డికి వైసిపిలో సముచిత స్థానం దక్కకపోవడంతో విలువ లేని చోట ఉండకూడదనే ఉద్దేశంతో ఆయన పార్టీ మారెందుకు నిర్ణయం తీసుకున్నట్లు ఆయన అనుచరులు అంటున్నారు. గురువారం ఉదయం నియోజకవర్గం నుంచి వందలాది వాహనాలతో టిడిపి పార్టీ రాష్ట్ర కార్యాలయానికి చేరుకుని బలప్రదర్శనతో టిడిపి కండువా కప్పుకోనున్నారు. ఆయన రాకతో టిడిపిలో బలం పుంజుకుంటుందని విశ్లేషకులు అంటున్నారు.

విరాళం అందిస్తున్న ఇడిమడకల సాయి శ్రీనివాస్

ఆలయానికి రూ.25 వేలు విరాళం

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

ఇడిమడకల గిరిపతి నాలుగవ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన తనయుడు సాయి శ్రీనివాస్ బుధవారం పట్టణ పరిధిలోని ఉదయగిరి యల్లమ్మ ఆలయానికి రూ.25 విరాళాన్ని ఆలయ కమిటీ సభ్యులకు అందించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఉదయగిరి ఎల్లమ్మ దేవస్థానం అభివృద్ధి కొరకు ఇడిమడకల గిరిపతి ఎంతగానో శ్రమించారని, కోశాధికారిగా కూడా సేవలందించారని గుర్తు చేశారు. ప్రస్తుతం ఆయన తనయుడు సాయి శ్రీనివాస్ ఉన్నత ఉద్యోగంలో ఉంటూ జనసేన పార్టీ ఐటి శాఖలో బాధ్యతలు నిర్వర్తిస్తూ తండ్రి బాటలోనే ఆలయ అభివృద్ధికి సహకరించడం అభినందనీయమని అన్నారు. సాయిశ్రీనివాస్ మాట్లాడుతూ తన తండ్రి జ్ఞాపకార్థం ఆల యానికి విరాళం అందించినట్లు తెలిపారు. భవిష్యత్తులో కూడా ఆలయ అభివృద్ధికి తన వంతు సహాయ, సహకా రాలు అందిస్తానని తెలిపారు. కార్యక్రమంలో ముమ్మడి చిన్నయ్య, నారదాసు రామచంద్రయ్య, ఇడిమడకల చంద్రశేఖర్, ప్రభాకర్, రామకృష్ణ, సాయి, సుష్మ, లియా, పూజారి రవి, రమేష్, గణేష్ పాల్గొన్నారు.

చంద్రబాబు సభను జయప్రదం చేయండి : 'నల్లారి'

ప్రజాశక్తి-పీలేరు

ఈ నెల 24న పీలేరులో తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేపట్టనున్న రా.. కదిలిరా... కార్యక్రమాన్ని గ్రామాల వారీగా ప్రజలు తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి పీలేరు నియోజకవర్గ బాధ్యులు నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి తెలిపారు. 2024 ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ గెలుపే లక్ష్యంగా ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న రా.. కదలిరా... బహిరంగ సభకు స్వచ్ఛందంగా తరలిరావాలని, బుధవారం పార్టీ శ్రేణులతో స్థానిక టిడిపి కార్యాలయంలో మండల, గ్రామీణ ప్రాంత పార్టీ నాయకులు, కార్యకర్తలు, అనుబంధ సంఘాలతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షేత్ర స్థాయి, భూత్ స్థాయిలో తమకు అనుకూలంగా ఉన్న వాహనాల్లో పెద్ద ఎత్తున తరలి వచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. అదేవిధంగా ఎస్సి, ఎస్టీ, బిసి, మైనార్టీ వర్గాల కార్పోరేషన్లను నిర్వీర్యం చేస్తూ రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజల సంక్షేమాలను తూట్లు పొడిచిన జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వానికి గద్దె దింపడమే తెలుగుదేశం పార్ట్ లక్ష్యమని అన్నారు. అపద్దాలుచెప్పి అధికారంలోకి వచ్చిన జగన్మోహన్ రెడ్డిపై ప్రజలకు నమ్మకం పోయిందని అన్నారు. రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమం, అభివ ృద్ధి, తెలుగుదేశం పార్టీతోనే సాధ్యమని, దుర్మార్గపు ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ, రాష్ట్రంలో మళ్ళీ పూర్వవైభవం రావాలని అందుకు వచ్చే ఎన్నికల్లో అందరూ తెలుగుదేశం పార్టీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అందరూ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కిషోర్‌కుమార్‌రెడ్డి


కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న అల్లాబకాష్

కాంగ్రెస్‌లో 180 కుటుంబాలు చేరిక

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

మండలం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సయ్యద్ అహ్మద్, నియోజకవర్గ కన్వీనర్ ఆధ్వర్యంలో జిల్లా కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులు అల్లాబకాష్ సమక్షంలో ఎస్‌సి, ఎస్‌టి, ముస్లిం మైనార్టీ కుటుంబాలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా పార్టీ మండల అధ్యక్షుడు సయ్యద్‌అహ్మద్ మాట్లాడుతూ వై.ఎస్. షర్మిల పిసిసి బాధ్యతలు స్వీకరించడంతో పార్టీకి బలం చేకూరిందని అన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షురాలు షేక్ ఆఫ్రీన్, రాష్ట్ర ఎస్‌సి సెల్ కన్వీనర్ శాంతయ్య, పుల్లంపేట, ఓబులవారిపల్లి మండల అధ్యక్షులు రమేష్ హరికృష్ణరెడ్డి, మదనపల్లె మండల అధ్యక్షుడు అమీర్, ముస్లిం నాయకులు హాఫీజ్ ఉల్లా, మక్బూల్, జబీబుల్లా, అస్లాం, షకీల్, జహంగీర్, గౌస్, జహీర్, కోటేశ్వరమ్మ, యూత్ లీడర్ కృష్ణ, సీనియర్ లీడర్ బ్రహ్మయ్య పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహావిష్కరణకు తరలిరండి

ప్రజాశక్తి-పుల్లంపేట

ఈనెల 19న విజయవాడలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రూపు దిద్దిన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 125 అడుగుల కాంస్య విగ్రహ ఆవిష్కరణకు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ నాయకులు, ప్రజలు తరలి వచ్చి విజయవంతం చేయాలని ఎపి ఎస్‌సి వెల్ఫేర్ కో-ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ మడకలం శ్రీనివా సులు కోరారు. రాష్ట్ర ప్రభుత్వం రూ.400 కోట్లతో భారతరత్న అంబేద్కర్ విగ్రహం, ఆడిటోరియం లైబ్రరీ, శృతివనం వంటి నిర్మాణాలను చేపట్టడం చారిత్రాత్మక ఘట్టమని, సామాజిక న్యాయ మహా శిల్పంతో ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీల ఆత్మగౌరవం ప్రస్తుత సమాజంలో పెరిగిందని అన్నారు. ఉమ్మడి కడప జిల్లాల నుంచి దళిత సంఘాల నాయకులు, దళిత సోదరులు, ఎస్‌సి సంఘాలు విజయవాడకు తరలిరావాలని పిలుపునిచ్చారు.

విజేత జట్టుకు ట్రోఫీ, నగదు బహుమతి అందిస్తున్న నిజాముద్దీన్

క్రీడాకారులను ప్రోత్సహించాలి

ప్రజాశక్తి-గాలివీడు

క్రీడలపై ఆసక్తి ఉన్న యువతను ప్రోత్సహించడం క్రీడాకారుడి లక్షణమని టివిఎస్ షోరూం అధినేత ఎస్‌కె నిజాముద్దీన్ పేర్కొన్నారు. బుధవారం ఎల్లంపల్లిలో జరిగిన క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్ మ్యాచ్‌లో బహుమతిగా రూ.5500 నగదును ప్రోత్సాహకాన్ని అందించారు. మండలంలో యువకులకు క్రికెట్, వాలీబాల్ బ్యాడ్మింటన్‌లో ప్రతిభ చాటిన క్రీడాకారులకు దుస్తులు, వారికి అవసరమైన క్రీడా పరికరాలు అందించడం తన సంకల్పమని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో శీలం శంకర్‌నాయుడు, క్రీడాకారులు పాల్గొన్నారు.

మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న తల్లెంభరత్

పేద మహిళలకు చీరల పంపిణీ

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని మంగంపేట కాపుపల్లి గ్రామానికి చెందిన గుంతకల్ రైల్వే బోర్డ్ మెంబర్ తల్లెం భరత్ కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంగంపేట చుట్టుపక్కల గ్రామాల నుంచి వచ్చిన వందలాదిమంది ప్రజలకు చీరలు పంపిణీ చేయడం ఆనం దంగా ఉందని అన్నారు. చీరల కోసం వచ్చిన మహిళలందరికీ భోజన వసతిని కల్పించినట్లు తెలిపారు. కార్యక్ర మంలో పోలి కృష్ణారెడ్డి, గజ్జల శ్రీనివాసులు రెడ్డి, తల్లెం వెంకట సుబ్బారెడ్డి, తల్లెం రామ చంద్రారెడ్డి, ఈశ్వర్ రెడ్డి, చుట్టుపక్కల గ్రామ ప్రజలు మహిళలు పాల్గొన్నారు.

అధికారంలోకి రావడమే కాంగ్రెస్ లక్ష్యం

- పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

2024 సార్వత్రిక ఎన్నికల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అధికారంలోకి రావడమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి అన్నారు. బుధవారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీకి రాష్ట్రంలో సానుకూల వాతావరణం ఉందన్నారు. ఇటీవల రెండు రాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినట్లే.. ఆంధ్రప్రదేశ్‌లో కూడా అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. వైనాట్ కాంగ్రెస్ ఇన్ ఎపి అన్న నినాదంతో కాంగ్రెస్ ముందుకు పోతుందని చెప్పారు. రాష్ట్రంలో ప్రాంతీయ పార్టీలైన వైసిపి, టిడిపి, జనసేన బిజెపి చేతిలో కీలుబొమ్మలని విమర్శించారు. వైఎస్ షర్మిల కాంగ్రెస్ పార్టీలో చేరడంతో కాంగ్రెస్ పార్టీకి అదనపు బలమని తులసిరెడ్డి పేర్కొన్నారు. కాంగ్రెసు పార్టీ అధికారంలోకి వస్తే రూ.3 లక్షలు వరకు వ్యవసాయ రుణాలు మాఫీ, రూ.500కు వంట గ్యాస్ సిలిండర్ సరఫరా, నిరుపేదలకు నెలకు రూ.6000 ఆర్థికసాయం అమలు చేస్తామన్నారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రజలు ఆదరించాలని ఆయన కోరారు.

ప్రకటన

మా కక్షిదారులైన అనగాని రామ చంద్ర కుమారుడు అనగాని గణేష్ గారి ఒరిజినల్ లింక్ దస్తావేజులు రాచపల్లి నుండి రాయచోటికి ద్విచక్ర వాహనంలో వెల్తూ ఉండగా దారి మధ్యలో పోయినవి.

పోయిన దస్తావేజుల వివరములు

1.DOC.NO.1410/1995-తేదీ 24.02.1995

2.DOC.NO.5525/2002 - తేదీ 05-12-2002

పై దస్తా వేజులు ఎవరికైన దొరికినచో క్రింది అడ్రస్‌కు చేర్చవలయునని మనవి. చేర్చిన వారికి తగిన పారితోషికం ఇవ్వబడును.

ఇట్లు
పగడాల శ్రీనివాసులు, బి.ఎ.బి.ఎల్,
న్యాయవాది మరియు నోటరి,రాయచోటి.
సెల్ నెం. 9059398112.

గ్రూప్-2 దరఖాస్తు గడువు పొడిగించాలి

ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్): గ్రూప్-2 దరఖాస్తు చేసుకునేందుకు గడువు పొడిగించాలని డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు డేవిడ్ రాజు తెలిపారు. స్థానిక డివైఎఫ్ఐ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా అభ్యర్థులు సైట్ పనిచేయలేదని, సర్వర్ డౌన్, ఏపీపీఎస్సీ వెబ్‌సైట్ సరిగా పనిచేయక చాలామంది దరఖాస్తు చేసుకోలేదన్నారు. గ్రూప్-2 గడువును పొడిగించాలన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో వసతులపై దృష్టి పెట్టాలి

ప్రజాశక్తి-బి.కొత్తకోట

పోలింగ్ కేంద్రాలలో మౌలిక సదుపాయాల కల్పనపై అధికారులు దృష్టి సారించాలని హెచ్ఎన్ఎస్ఎస్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రాఘవేంద్ర ఆదేశించారు. బుధవారం మండలంలోని బాలుర ఉన్నత పాఠశాల, తుమ్మరకుంట ఉర్దూ పాఠశాలతో పాటు మండలంలో మొత్తం 12 పోలింగ్ బూత్‌లను తనిఖీ చేశారు. ఎన్నికలు నిర్వహణకు అనుకూలంగా ఉండే పాఠశాలలను ఆయన పరిశీలించారు. ఆయన పరిశీలించారు. ర్యాంపులు, తాగునీరు, మరుగుదొడ్లు, ఫర్నిచర్, విద్యుత్ సౌకర్యం వంటి అన్ని వసతులు తప్పనిసరిగా ఉండాలని సూచించారు. ఎన్ని కల నిర్వహణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఓటర్లకు కల్పించాల్సిన మౌలిక వసతులపై ఆయన పలు సూచనలు, సలహాలిచ్చారు. ఆయన వెంట తహశీల్దార్ రఫీఅహ్మద్, ఎంఇఒ రెడ్డిశేఖర్, భువనేశ్వరాచారి, విఆర్ఒ నరేంద్ర ఉన్నారు.

పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డిప్యూటీ కలెక్టర్ రాఘవేంద్ర

చీనీ రైతుల ఆశలు చిగురించేనా..!

ఆశాజనకంగా సీజన్ కాపు, పూత

ఆశాజనకంగా పూతతో ఉన్న చీనీ చెట్లు

ప్రజాశక్తి - సింహాద్రిపురం

ఈ ఏడాది సీజన్ కాపునకు సంబంధించి చీనీ రైతులు నీటి తడులను చెట్లకు అందించారు. ప్రస్తుతం చీనీ చెట్టు ఆశాజనకంగా పూతలు రావడంతో రైతుల్లో హర్షం వ్యక్తమవుతోంది. గత మూడేళ్ల నుంచి పూతలు వచ్చినప్పటికీ వాతావరణంలో మార్పులు కారణంగా చీనీ గోలికాయ దశలో రాలిపోయి తీవ్రంగా నష్టపోయారు. నియోజవర్గంలో దాదాపు 54 వేల ఎకరాల్లో చీనీ తోటలు సాగులో ఉన్నాయి. తోటల్లో రైతులు చెట్టు ఎండు కొమ్మలను కటింగ్ చేయించి, ఎరువులను వేసి వాడు దశకు వచ్చేలా చర్యలు చేపట్టి నీటి తడులను అందిస్తున్నారు. ఈ ఏడాది వాతావరణంలో చలి తక్కువగా ఉన్నందున పూతలు వచ్చినప్పటికీ ఎండలు అధికమైతే కాయ పిందె దశలోనే రాలిపోయే అవకాశం ఉందని మరో వైపు రైతుల్లో ఆందోళన నెల కొని ఉంది. సకాలంలో నీటి తడులు అందిస్తేనే మంచి దిగుబడులు. రైతులు సకాలంలో తమ తోటలకు నీటి తడులు వస్తేనే మంచి దిగుబడులు వస్తాయని ఉద్యాన శాఖ విస్తరణాధికారి వీరారెడ్డి చెబుతున్నారు. రైతులు నవంబర్ 15 నుంచి డిసెంబర్ 20 తేదీలోపు తమ చెట్లకు వాడు దశను వదిలించి నీటి తడులు అందించాలని అప్పుడే గణనీయమైన దిగుబడులు సాధ్యమవుతుందన్నారు. అంతకు మించి నీటి తడులు అందించినట్లయితే సమగ్ర సస్యరక్షణ చర్యలు చేపట్టినట్లయితే దిగుబడులు వచ్చే అవకాశం ఉంది.

పథకాల పట్ల అవగాహన అవసరం

ప్రజాశక్తి-కడప

కార్మికులు ప్రభుత్వ పథకాల పట్ల అవగాహన కలిగి ఉండాలని లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ న్యాయవాదులు సూచించారు. సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ సెక్రెటరీ బాబా ఫక్రుద్దీన్ ఆదేశాల మేరకు బుధవారం కడప నగరంలోని ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లోని చైతన్య కెమికల్స్‌లో లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ న్యాయవాదులచే న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వ హించారు. ఈ సందర్భంగా లీగల్ ఎయిడ్ డిఫెన్స్ న్యాయవాదులు మాట్లాడుతూ కార్మికులు ప్రభుత్వ పథకాల పట్ల అవగాహన కలిగి ఉండాలి, పనిచేసే చోట తప్పనిసరిగా ఈపీఎఫ్, ఈఎస్ఐ సదుపాయాలు కలిగించేలా యాజమాన్యం చూసుకోవాలి అన్న విష యాలను వివరించారు. లీగల్ ఎయిడ్ క్లినిక్, పారా లీగల్ వాలం టరీల విధివిధానాలు తెలియజేశారు, ఆయుష్మాన్ భారత్ హెల్త్ కార్డు గురించి వివరించారు, కార్మికులు చట్టాల పట్ల అవగాహన కలిగి ఉండాలి, కార్మికుల ప్రమాదాలు కాంపెన్సేషన్, ఈ శ్రమ కార్డ్స్, మొదలగు అంశాలను వివరించారు. ఏమైనా సమస్య ఉంటే జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కడపను సంప్రదించవచ్చునని పేర్కొన్నారు. కార్యక్రమంలో శాంత, డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్, అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ ఎస్.శ్రీనివాస్, పారా లీగల్ వాలంటరీ జె.సురేష్ సహాయం, చైతన్య కెమికల్స్ మేనేజ్మెంట్, కార్మికులు పాల్గొన్నారు.

బ్రెయిలీ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని వినతి

పులివెందుల రూరల్ : చూపులేని వారి జీవితాల్లో వెలుగులు నింపిన మహనీయుడు లూయీ బ్రెయిలీ విగ్రహాన్ని పులివెందుల పట్టణంలోని ఓ ప్రధాన కూడలిలో ఏర్పాటు చేయాలని ఎపి విభిన్నప్రతిభావంతుల నెట్‌వర్క్ రాష్ట్ర అధ్యక్షులు ఇరికిరెడ్డి రఘునాథరెడ్డి కోరారు. ఆ మేరకు బుధవారం ఆయన ఆధ్వర్యంలో విభిన్నప్రతిభావంతులు మున్సిపల్ ఇన్‌ఛార్జి వైయస్ మనోహర్‌రెడ్డికి వినతిపత్రమిచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పులివెందుల మోడల్ సిటీ తరహాలో రోడ్ల విస్తరణ కార్యక్రమాలు, కొత్త సర్కిళ్లు ఏర్పాటు చేస్తున్నందున ఏదైనా ఒక కూడలిలో స్ఫూర్తి ప్రదాత లూయీ బ్రెయిలీ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తే, భావితరాలకు ఆయన అంధులకు చేసిన సేవలు అందుతాయన్నారు. పులివెందుల పట్టణంలో ఏర్పాటు చేస్తే లూయీ బ్రెయిలీ విగ్రహం రాష్ట్రానికే ఆదర్శంగా నిలుస్తుందన్నారు. ఇందుకు సానుకూలంగా స్పం దించిన వైయస్ మనో హర్‌రెడ్డి ప్రభుత్వానికి నివేదిక పంపి తప్పకుండా త్వరలో పట్టణంలోని ఒక కూడలిలో బ్రెయిలీ విగ్ర హాన్ని ఏర్పాటు చేస్తా మని వారికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎపి విభిన్నప్రతిభావంతుల నెట్‌వర్క్ కార్యదర్శి ఆర్.వెంకటసుబ్బయ్య, సంయుక్త కార్యదర్శి సునీల్, కార్యవర్గ సభ్యులు చంద్రఓబులరెడ్డి, బాబు పాల్గొన్నారు.

చాపాడు తహశీల్దార్‌గా భూషణం

ప్రజాశక్తి - చాపాడు

చాపాడు తహశీల్దార్‌గా వై.భూషణం నియమితులయ్యారు. మూడు నెలల క్రితం చాపాడు తహశీల్దార్‌గా పనిచేస్తున్న సుభానిని కలెక్టర్ ప్రభుత్వానికి సరెండర్ చేసిన విషయం తెలిసిందే. అప్పటి నుంచి డిప్యూటీ తహ శీల్దార్ యామిని ఇన్‌ఛార్జిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం రాయల సీమ జోన్ పరిధిలో చేపట్టిన సాధారణ బదిలీలో భాగంగా గుంతకల్లు ఆర్‌డిఒ కార్యాలయంలో పనిచేస్తున్న భూషణం తహశీల్దార్‌గా నియ మితులయ్యారు.

'మహర్షి' పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి - ముద్దనూరు

మండల కేంద్రంలోని మహర్షి ఇంగ్లిష్ మీడియం హైస్కూల్ 2012 బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు బుధవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహిం చారు. కరస్పాండెంట్, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, స్నేహితులను కలుసుకుని అలనాటి మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకుని ఒకరి నొకరు ఆప్యా యంగా పలకరించుకున్నారు. పూర్వ విద్యార్థులు కలిసి పాఠశాల కరస్పాండెంట్, ప్రధానోపాధ్యాయులు లోకనాధ్‌ను, ఉపాధ్యాయులను పూలమాలలు వేసి శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు తమ జ్ఞాపకంగా పాఠశాలకు సౌండ్ స్పీకర్లు వితరణ చేశారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి, నృత్యాలతో అలరించారు.

విద్యార్థులు రాణిస్తే ఉపాధ్యాయులకు గర్వకారణం

చాపాడు : విద్యార్థులు వివిధ రంగాల్లో రాణించినప్పుడే ఉపాధ్యాయులకు గర్వకారణంగా ఉంటుందని పూర్వ ప్రధానోపాధ్యాయులు జయరామిరెడ్డి పేర్కొన్నారు. చాపాడు జిల్లా పరిషత్ హైస్కూల్లో 2008-09 పదవ తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులు కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తరగతి గదిలో చదువుకున్న అంశాలను సమాజంలో ఉపయోగపడే పనులకు ఉపయోగించాలన్నారు. సమాజాభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. అనంతరం 15 సంవత్సరాల తర్వాత ఒకచోట కలుసుకున్న స్నేహితులతో పూర్వ విద్యార్థులు పాత జ్ఞాపకాలు నెమరు వేసుకున్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

వైసిపికి ఓట్లేస్తే రాష్ట్రం సర్వనాశనం

- టిడిపి జిల్లా అధ్యక్షులు మల్లెల లింగారెడ్డి

ప్రజాశక్తి-కడప అర్బన్

ఒక్కసారి ప్రజలు నమ్మి ఓట్లు వేస్తేనే, రాష్ట్రాన్ని వైసిపి ప్రభుత్వం అధోగతి పాలు చేసిందని, మరో మారు ఓట్లు వేస్తే, రాష్ట్రం సర్వనాశనం కావడం ఖాయమని టిడిపి కడప జిల్లా అధ్యక్షుడు మల్లెల లింగారెడ్డి ధ్వజమెత్తారు. టిడిపి జిల్లా కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అధికారంలోకి రాగానే దశల వారీగా మద్యనిషేధం అమలు చేస్తానని చెప్పిన జగన్, మద్యాన్ని ఏరులై పారిస్తూ, ధరలు పెంచి విక్రయిస్తూ మద్యం రాయుళ్ల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని మండిపడ్డారు. మద్యం, విద్యుత్ ఛార్జీల పెంపు రాబడి తోనే ప్రజా సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి చేసుకోవచ్చని చెప్పారు. జగన్మోహన్‌రెడ్డి రాష్ట్రంపై రూ.13 లక్షల కోట్లు అప్పు చేశారని, నీటి ప్రాజెక్టులు పూర్తి చేశారా, అప్పుచేసి అభివృద్ధి పనులు ఏమి చేశారని ఆయన సూటిగా ప్రశ్నించారు. ఇక చేసిన అప్పు ఎలా తీరుస్తారని నిలదీశారు. ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు గాలేరు-నగిరి సుజల స్రవంతి ప్రాజెక్టుకు రూ.2500 కోట్లు ఖర్చు చేశారని తెలిపారు. పులివెందులకు నీళ్లు ఇచ్చిన ప్రభుత్వం తెలుగుదేశం పార్టీదేనన్నారు. గోరకల్లుకు రూ.6000 కోట్లు, పులి కనుమకు రూ.294 కోట్లు, అవుకు టన్నెల్‌కు రూ.450 కోట్లు ఖర్చు చేసి పనులు చేపట్టామని గుర్తు చేశారు. ఈ ప్రభుత్వం నీటి ప్రాజెక్టులను నిర్వీర్యం చేసిందని మండిపడ్డారు. ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై గొంతు ఎత్తితే, అరెస్ట్ చేయడం జైలుకు పంపడం, ఈ ప్రభుత్వ నియంత పాలనకు నిదర్శనమని పేర్కొన్నారు. పేరుకే సంక్షేమ పథకాలని, పన్నులపై, పన్నులు వేసి పేద, మధ్యతరగతి ప్రజల నడ్డి విరిచిన ప్రభుత్వం వైసిపిదేనన్నారు. ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై విరుచుకుపడ్డారు. ఈ నెల 19న కమలాపురంలో చంద్రబాబు నిర్వహించే రా, కదలిరా బహిరంగ సభను జిల్లాలోనే నాయకులు, కార్యకర్తలు, పార్టీ అభిమానులు తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో సీనియర్ నాయకుడు లక్ష్మిరెడ్డి, సుధాకర్ యాదవ్, కాసిం, రామాంజి పాల్గొన్నారు.

పనులు వేగవంతం చేయాలి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - చాపాడు

మండలంలో పెండింగ్‌లో ఉన్న పలు అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని ఎమ్మెల్యే ఎస్. రఘురామిరెడ్డి సూచించారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయ ఆవరణలో బుధవారం ఆయన అధికారులు, ప్రజాప్రతినిధులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చాపాడు చర్చి పనులకు రూ.12 లక్షలు, బద్రిపల్లె చర్చి నిర్మాణ పనులకు రూ.6 లక్షలు ఎంపీ నిధుల ద్వారా మంజూరు చేయించామన్నారు. అల్లాడుపల్లె రైతు సేవా సహకార సంఘం బ్యాంకు ఆవరణలో ఉన్న స్థలంలో అభివృద్ధి పనులు చేపట్టేందుకు నిధులు మంజూ రయ్యాయని, నిర్మాణానికి అనుమతులు ఇవ్వాలని పంచాయతీ కార్యదర్శి ధనుంజయ బాబుకు సూచించారు. పెండింగ్‌లో ఉన్న నూతన హైస్కూల్ భవనాల పనులను వెంటనే పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. కార్యక్రమంలో ఎంపిపి లక్షుమయ్య, జడ్పిటిసి భర్త శాంతరాజు, పంచాయతీరాజ్ ఎఇ ఈశ్వరయ్య, సొసైటీ సిఇఒ జాన్, నాయకులు పాల్గొన్నారు.

వ్యవసాయ సహకార పరపతి సంఘం భవనం ప్రారంభం

బ్రహ్మంగారిమఠం : మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయం వద్ద నూతనంగా నిర్మించిన వ్యవసాయ సహకార పరపతి సంఘం భవనాన్ని బుధవారం ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి, ఆప్కో చైర్ పర్సన్ మల్లెల ఝాన్సీ, సోమిరెడ్డిపల్లి సహకార పరపతి సంఘం చైర్మన్ నేలటూరి సుబ్బారెడ్డి ప్రారంభించారు. మండలంలోని రైతులు పరపతి సంఘం ద్వారా అన్ని బ్యాంకుల కంటే తక్కువ వడ్డీకే పంట రుణాలు, బంగారు, వాహన రుణాలు అందుబాటులో ఉంటాయని వక్తలు తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని కోరారు. సొంత భవనం ఏర్పాటు చేసుకోవడంపై ఎమ్మెల్యే హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మైదుకూరు నియోజకవర్గ సమన్వయకర్త శెట్టిపల్లి నాగిరెడ్డి, ఎంపిపి వీరనారాయణ రెడ్డి, జడ్పీటిసి రామ గోవిందరెడ్డి, చౌదరవారిపల్లి సర్పంచ్ ఓబుల్‌రెడ్డి, నాయకులు భాస్కర్‌రెడ్డి, ఉమాపతి, పాల రామిరెడ్డి పాల్గొన్నారు.

చంద్రబాబు శేషజీవితం జైల్లోనే : 'రాచమల్లు'

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

ప్రతిపక్ష నాయకుడు చంద్రబాబు స్కిల్ కేసులో తన శేషజీవితాన్ని జైల్లోనే గడపాల్సి వస్తుందని ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాదరెడ్డి పేర్కొ న్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో బుధ వారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 17ఏ పై న్యాయమూర్తులు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేశారని, బాబుపై పెట్టిన కేసులో చట్టబద్ధత ఉందని, ఈ కేసులో సుప్రీం కోర్టు తీర్పును స్వాగతిస్తున్నామన్నారు. ఈ కేసులో సాక్షాధారాలు బలంగా ఉన్నందునే సుప్రీం కోర్టు జోక్యం చేసుకోలేదని తెలిపారు. 2024 ఎన్నికలకు ఫిబ్రవరి మూడవ వారంలోగా నోటిఫికేషన్ వచ్చే అవకాశం ఉందన్నారు. ఇందుకు సంబంధించిన విధులను ఎన్నికల కమిషన్ వేగవంతం చేసిందన్నారు. ప్రజలు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా విని యోగించుకునేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తోం దన్నారు. అనంతరం రాష్ట్ర వైసిపి అదనపు కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి స్వగృహంలో విడిగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జనవరి 19న రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ విగ్రహావిష్కరణ విజయవాడలో రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో అట్టహాసంగా జరుగుతుందన్నారు. 2014-19 చంద్రబాబు హయాంలో విజయవాడలో దళితులకు అద్దెకు ఇళ్లు దొరకని పరిస్థితి అన్నారు. జగన్ హయాంలో అంబేద్కర్ విగ్రహం విజయ వాడ నడిబొడ్డున ఏర్పాటు చేస్తుండడం దళి తులకు దక్కిన సామాజిక న్యాయానికి అద్దం పడు తోందన్నారు. విగ్రహావిష్కరణ కార్యక్రమానికి రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు హాజరవుతున్నారని తెలి పారు. ప్రొద్దుటూరు నుండి అయిదు బస్సుల్లో 250 మంది ప్రజలు హాజరవుతున్నారని తెలి పారు. అంతేకాక సొంత వాహనాల్లో బయలు దేరుతున్నారన్నారు. సమావేశంలోదళితసంఘ నేతలు పాల్గొన్నారు.

డిసిసి కార్యదర్శిగా నాగరాణి

ప్రజాశక్తి - కడప

జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్య దర్శిగా పైడికాల్వ నాగరాణిని నియమిస్తూ ఉత్తర్వులు అందాయి. ఆమెకు నియామక పత్రాన్ని బుధవారం పిసిసి మీడియా చైర్మన్ ఎస్.తులసిరెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా నాగ రాణి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అభి.వృద్ధికి తన వంతు కృషి చేస్తానని చెప్పారు. కాంగ్రెస్ పార్టీని 2024లో జరగబోవు ఎన్ని కల్లో గెలిపించుకొని రాహుల్ గాంధీని ప్రధాన మంత్రిగా చేయడమే తమ లక్ష్యమని పేర్కొ న్నారు. తనకు ఈ బాధ్యతలు అప్పగించిన పార్టీ శ్రేణులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

శ్రీకృష్ణదేవరాయలు చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న జనసేన నాయకులు

ఘనంగా శ్రీకృష్ణదేవరాయలు జయంతి

ప్రజాశక్తి-సుండుపల్లి

సుండుపల్లి మండల కేంద్రం నాలుగు రోడ్ల కూడలిలో బుధవారం శ్రీకృష్ణ దేవరాయలు జయంతి సందర్భంగా జనసేనపార్టీ నాయకులు రామశ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా రామశ్రీనివాస్ మాట్లాడుతూ శ్రీకృష్ణ దేవరాయులు గొప్ప పరిపాలన దక్షుడని కొనియాడారు. ప్రస్తుతం సమాజంలో రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధులు ఆయన ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో పూజారి వెంకటయ్య, మాజీ ఆర్మీ నంద్యాల కృష్ణయ్య, గ్రామ అధ్యక్షులు చెన్నశెట్టి సుబ్బరాము,రాజంపేట పార్లమెంట్ వాణిజ్య విభాగ అధికార ప్రతినిధి దామోదర్ నాయుడు, దళితనాయకులు వీరణాగయ్య, మైనార్టీ నాయ కులు చాన్‌బాషా, కృష్ణానాయక్, చంద్రప్పనాయుడు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కులగణన సక్రమంగా నిర్వహించాలి

ప్రజాశక్తి-తంబళ్లపల్లె

మాట్లాడుతున్న ఇఒ ఆనంద్‌కుమార్

మండలంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు కులగణనను సక్రమంగా నిర్వహించాలని ఎంపిడిఒ కార్యాలయ ఇఒ ఆనంద్ కుమార్ తెలి పారు. బుధవారం ఎంపి డిఒ కార్యాలయంలో సచివాలయ ఉద్యోగులకు కుల గణనపై శిక్షణ ఇచ్చారు. ఈనెల 19 నుంచి 28వ తేదీ వరకు ఇంటింటికి వెళ్లి కులగణన పూర్తి చేయాలని సూచించారు. యాప్‌లో కుల గణన వివరాలు పొందుపరిచే తీరుపై శిక్షణ ఇచ్చారు. విధి నిర్వహణలో ఎవరు నిర్లక్ష్యం చేసినా చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నరసింహులు , సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

కిషోర్‌కుమార్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందిస్తున్న రెడ్డెప్ప

'నల్లారి'ని కలిసిన పారిశ్రామికవేత్త రెడ్డెప్ప

ప్రజాశక్తి-కలికిరి

స్థానిక మండల కేంద్రంలోని నగిరిపల్లిలో టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిషోర్ కుమార్ రెడ్డితో ప్రముఖ పారిశ్రామికవేత్త వల్లిగట్ల రెడ్డెప్ప మర్యాద పూర్వకంగా కలిసి దుశ్శాలువాతో సత్కరించారు. ఈ సందర్భం గా వారు మాట్లాడుతూ భవిష్యత్తు కార్యాచరణపై పునరాలోచన చేసి టిడిపి బలోపేతానికి కృషి చేస్తానని చెప్పారు. గత 25 సంవత్సరాలుగా కురబ సామాజిక రాష్ట్ర అధ్యక్షులుగా వివిధ పదవులలో కురుబ కుల అభివృద్ధికి పని చేశానని తెలిపారు. కార్యక్రమంలో రాజంపేట పార్లమెంట్ కురబకుల అధ్యక్షుడు జనార్దన్ గౌడ్, కలకడ మండల మాజీ ఎంపిపి శ్యామల కాంతారావు, సర్పంచ్ కమల్నాథ్, రెడ్డి శేఖర్, గుడిబండ రెడ్డిశేఖర్, రవి యాదవ్ పాల్గొన్నట్లు తెలిపారు.

రాజకీయ మహాప్రస్థానాన్ని జయప్రదం చేయండి

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

2024లో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీలు ప్రస్తుతం ఉన్న రిజర్వేషన్ల స్థానాలతోపాటు జనరల్ స్థానాల్లో దళితులకు ప్రాతినిధ్యం కల్పించే అంశంపై ఎపి ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఈనెల 20న విజయవాడలోని గాంధీనగర్ ప్రెస్‌క్లబ్‌లో మాదిగ, ఉపకులాల రాజకీయ మహాప్రస్థానం సమావేశాన్ని జయప్రదం చేయాలని రాష్ట్ర అధ్యక్షులు దండు వీరయ్య మాదిగ పిలుపునిచ్చారు. స్థానిక ఎమ్మార్పీఎస్ కార్యాలయం వద్ద బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సమావేశంలో రాష్ట్ర చర్మడప్పు కళాకారుల సంఘం అధ్యక్షులు నాగభూషణం, విద్యార్థి విభాగం జమ్మలమడుగు నియోజకవర్గ అధ్యక్షులు కొమ్ము రఘురాముడు, ఎర్రగుంట మండల అధ్యక్షులు రామాంజనేయులు, జిల్లా సహాయ కార్యదర్శి ఈశ్వరయ్య, చంద్రఓబులేసు, మాతయ్య, సుబ్బయ్య, గంగాధర్, వెంకటేష్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం : డిసిసి

ప్రజాశక్తి - కడప

రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా వైఎస్ షర్మిల బాధ్యతలు చేపట్టడంతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం వచ్చిందని డిసిసి అధ్యక్షులు గుండ్లకుంట శ్రీరాములు. నగర అధ్యక్షులు వై.విష్ణుప్రీతంరెడ్డి అన్నారు. 2024లో జరగబోవు ఎన్నికల్లో తప్పకుండా కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో విజయం సాధించి అధికారంలోకి వస్తుందని పేర్కొన్నారు. బుధవారం డిసిసి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ చరిత్రలో ఆంధ్రప్రదేశ్‌లో మొట్టమొదటిసారిగా ఓ మహిళను కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా నియమితులవ్వటం చాలా సంతోషకరమైన విషయన్నారు. గతంలో రాజశేఖర్‌రెడ్డి రెండుసార్లు పిసిసి అధ్యక్షులుగా ఉన్నారని, ఇప్పుడు ఆయన కుమార్తె షర్మిల పిసిసి అధ్యక్షులుగా బాధ్యతలు చేపట్టడంతో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం రావడంతో పాటు ఇది ఎంతో శుభ పరిణామని పేర్కొన్నారు. సమావేశంలో పిసిసి రాష్ట్ర కార్యదర్శి చీకటి చార్లెస్, పిసిసి డెలిగేట్ పొట్టిపాటి చంద్రశేఖర్‌రెడ్డి, రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షులు శ్యామలమ్మ, హ్యూమన్ రైట్స్ జిల్లా అధ్యక్షులు పాలగిరి పాల్గొన్నారు.

క్రైం కార్నర్

వృద్ధుడి ఆచూకీ లభ్యం

ప్రజాశక్తి-కలకడ

వృద్ధుడు మిస్సింగ్‌పై ఫిర్యాదు అందిన 24 గంటల్లోపే ఆచూకీని కనుగొన్నట్లు ఎస్ఐ తిప్పేస్వామి తెలిపారు. మండలంలోని నవాబుపేట మండెం వారిపల్లికి చెందిన వెంకటరమణ(61) ఈనెల 16న ఇంటిలో ఎవరూ లేని సమయంలో జీవితంపై విరక్తి చెంది ఇంటి నుంచి పారిపోయినట్లు వృద్ధుడి బంధువులు ఫిర్యాదు చేశారని తెలిపారు. వృద్ధుడి కుమారుడు పాపయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశామని తెలిపారు. తమ సిబ్బంది గాలింపు చర్యలు చేపట్టి చిన్నమండెంలో ఉన్నట్లు గుర్తించి బంధువులకు అప్పగిం చామని తెలిపారు. ఫిర్యాదు అందిన ఒకరోజులోపే వృద్ధుడి ఆచూకీని కనుగొన్న పోలీసు లను స్థానిక ప్రజలు ప్రశంసించారు.

ఏడుగురు పేకాట రాయుళ్లు అరెస్టు

ప్రజాశక్తి-ములకలచెరువు

పేకాట ఆడుతున్న ఏడుగురిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ గాయత్రి తెలిపారు. ఎస్ఐ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మండలంలోని గుడుపల్లి సమీపంలో పేకాట ఆడుతున్నట్లు సమాచారం రావడంతో తమ సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించినట్లు తెలిపారు. ఈ దాడిలో పేకాట ఆడుతున్న ఏడుగురిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.4300 నగదును స్వాధీనం చేస్తున్నట్లు తెలిపారు. ఈ దాడిలో పోలీస్ సిబ్బంది సుబ్బు, హరి, కుమార్, మహేష్, చిరంజీవి పాల్గొన్నట్లు తెలిపారు.